చిన్నారావ్ వయసు పది వసంతాలు.

వాడు చదువుతున్నది అయిదోతరగతి.

ఆ చదవడం ఒక అశ్వమేధయాగం చేయడంలాంటిది

ఒక రోజు వాళ్ళ సోషల్ స్టడీస్ మేష్టారు వాడిని భారత దేశ పటం కొనమన్నారు. కొని, దానికి రంగులు పూసి తెమ్మన్నారు.

ఆ దేశ పటం ఖరీదు పదిపైసలు. అడిగితే లేదు పొమ్మన్నాడు వాడి నాన్న. రిక్షాలాగే నాగన్న. అప్పుడింక చిన్నారావ్ అమ్మను వేధించగా, లచ్చమ్మ నాలుగు చివాట్లేసి పదిపైసలూ యిచ్చింది.

దేశపటం వచ్చింది. మరి రంగు పెన్సిళ్ళో? అవి చిన్నారావ్ వద్ద లేవు. రావు కూడాను.

చిన్నారావ్ బళ్ళో యెప్పుడూ తన జట్టుండే కృష్ణకుమార్ నడిగాడు. వాడో నీలం పెన్సిలు ముక్కా, ఒక ఆకుపచ్చ పెన్సిలు ముక్కా యిచ్చాడు.

వాడయినా ఒక పట్టానా యిచ్చాడా.... పదిసార్లు ప్రతిమాలించుకొని మరీ ఇచ్చాడు. వాడికేం, దర్జాగా అట్ట పెట్టె నిండా రంగు పెన్సిళ్ళున్నాయి. పుస్తకాలకీ తెల్లని మిలమిల మెరిసే పెట్టె వుంది. బడికి రావడానికి రిక్షా వుంది. వాళ్ళుండే ఇల్లు సినిమాల్లో బంగళాలా వుంటుంది.

ఇదంతా తలచుకున్నప్పుడల్లా చిన్నారావ్‌కు ఏదో బాధగావుంటుంది. తన అమ్మ, నాన్న ఇట్లా ఎందుకుండాలో, తను వాళ్ళతో కలిసి ఈ మురికికాలవ పక్కన తాటాకుల గుడిసెలో ఎందుకుండాలో అర్థంకాదు. మేష్టారినోసారి అడిగితే ఆయన నవ్వారు.

నీలం పెన్సిలు చెక్కడం అయింది. ములికి నీలంగా శ్రీకృష్ణుడి పించంలా మెరుస్తూంది.

అయితే కృష్ణకుమార్‌గాడికి డబ్బున్నా గర్వంలేదు వాడు చాలా మంచివాడు. ఆటల్లో ఎప్పుడూ తన జట్టే. చిన్నారావ్ పరుగెత్తినంత వేగంగా కుమార్‌గాడు పరుగెత్తలేడు. అదితలచుకుంటే చిన్నారావ్‌కు సంతోషంగా వుంటుంది. రన్నింగ్ రేస్‌లో తానెప్పుడూ ఫస్టే! నాలుగో తరగతిలో వుండగా రన్నింగ్ రేస్ గెలిచినందుకు తనకో "వెండి పతకం" ఇచ్చారు. అది తెచ్చి చూపెడితే "మా నాన్నే. మా బాబే" అని అమ్మ తన్ని ముద్దుపెట్టుకుంది. "మా చిన్నిగాడు పెద్దాపీసరయిపోతాడు-" అని తెగ సంబర పడిపోయింది. ఆ క్షణాన తాను నిజంగానే పెద్దవాడయిపోయి కాకీనిక్కరు, చొక్కా వేసుకుని, టోపీ వేసుకుని, చేత్తో బెత్తం పట్టుకుని - "ఒరేయ్ ఎవర్రా అక్కడ-" అంటే జనం అంతా అదిరిపోయి, అటెన్షన్‌లో నిలబడి తనకు సెల్యూట్ కొట్టినట్లనిపించింది చిన్నారావ్‌కు.


ఆ పతకమే— నాన్నకు చూపిస్తే "నన్నా సెదవా! ఏంటొస్తుందిరా దీంతో. అరముంత కల్లొస్తుందా? ఓ బ్రాకెట్ సీటీ వస్తుందా? ఎందుకొచ్చిన సదువుర్రా ఎర్రెదవా? సుబ్రంగా ఆ టీ కొట్లో కప్పులు కడిగితే రోజుకో రూపాయొస్తుంది—" అని అరిచాడు.

అది వినగానే చిన్నారావ్‌కు నాన్నను తందామనిపించింది.... అయితే వెంటనే అన్పించింది. అమ్మో, నాన్నని తన్నడమే! గూడెం గూడెమంతా నాన్నంటే బయపడతారు.

రిక్షాలాగే నాన్న సాయంత్రం చీకటవగానే ఇంటికొస్తే ఇక అమ్మకారోజు పండగే.... ఆ రోజు కుండ పొయ్యిమీద కెక్కుతుంది. తినడానికింత వేడి బువ్వ వుంటుంది. కాని వారంలో నాలుగురోజులు నాన్న ఇంటికి రాడు. వాళ్ళింట్లో, వాళ్ళింట్లో పాచిపని ముగించుకుని ఉసూరుమంటూ వచ్చిన అమ్మ; నాన్న ఏ సారాకొట్టు దగ్గర పడివుంటాడో అని వెతుక్కుంటూ బయలుదేరుతుంది.

చిన్నారావోసారి లక్ష్మి టాకీసులో 'రామాయణం' సినిమాచూశాడు. అందులో సీతమ్మ వారిని వెతుక్కుంటూ శ్రీరామచంద్రుడు వెళ్తాడు. మరిక్కడేమో అమ్మే నాన్నను వెతుక్కుంటూ బయలుదేరుతుంది. మరి సినిమాలో అట్లా చూపిస్తారెందుకో.... అస్సలా సిన్మాలో ఆ మంచి మంచి బట్టలు వేసుకునేవాళ్లు, కార్లెక్కేవాళ్లు, డాన్సు చేసేవాళ్లు - ఎంతందంగా వుంటారో.... వాళ్ళందరూ ఎక్కడ వుంటారో.... ఒకసారి వాళ్ళను దగ్గరగా చూడగలిగితేనో, అబ్బా!.... అయినా ఇక్కడ ఎవరూ అట్లా వుండరు. ఎంచేత? మరీ తమ గూడెంలో అయితే మురికి మురికిగా వుంటారు.

చిన్నారావ్ చేతినుంచి జారి పెన్సిల్ మట్టిలో పడింది. ములికి విరిగింది. దానిని జాగ్రత్తగా తీసుకుని విరిగిన బ్లేడ్



**ఆ చిన్నారి చిగురాకు చేతులు దేశానికి అందమైన రూపమిస్తే... దేశం ఆ జీవితానికి యివ్వబోయే రూపమేమిటి?**

# చిగురు

## నాగోటి పాండురంగారావు




ముక్కతో చెక్కాడు. ములికి చక్కగా కొనదేరి నిలబడింది. దానికి పెద్ద కార్యం సాధించినట్లయింది చిన్నారావ్‌కు.

భారత దేశ పటంకింద తెలుగు నోట్ పుస్తకాన్ని ఒత్తుగా పెట్టాడు. కాని ఆ పుస్తకం క్రింద మట్టినేల ఎగుడు దిగుడుగా వుంది. ఎటు జరిపినా నునుపుగా రావడం లేదు. చివరకు విసుగెత్తి చిన్నారావు పుస్తకాన్ని ఒళ్ళో పెట్టుకున్నాడు. దానిమీద మేప్‌నిపెట్టి ఎడమచేత్తో నొక్కి పట్టుకున్నాడు. దేశ పటాన్ని చూశాడు.

దేశం చుట్టూరా సముద్రాలుంటాయి-

వెలువడింది!
సంచలనాత్మక రచయిత
చలం నవల
మైదానం
ధర: 6.00
పుస్తకం ధర రూ॥ 6-00లు M.O. పంపిన
V.P.P లో పంపెదము.
అరుణా పబ్లిషింగ్ హౌస్
ఏలూరు రోడ్, విజయవాడ-2

శుభవార్త

డాక్టర్లకు సాధ్యముకాక వదిలి వేయబడిన అన్ని వ్యాధులకు చికిత్స చేయబడును. లావుపాటివారు సన్నగను, బలహీనులను బలవంతులుగను చేయబడుదురు. మధుమేహము, రక్తపుపోటు, కుష్టు, బొల్లి, క్యాన్సరు సంతానంలేని వారు కూడా శ్రీ యోగిగారి కాయకల్ప చికిత్సవలన సంపూర్ణ ఫలితము పొందగలరు. ఈ చికిత్స వలన దేహము లోని అన్నివ్యాధులు తొలగి పోవుటయేగాక నూతన యవ్వనము కలుగును. వివరములు కోరువారు పోష్టు ఖర్చులకు రు. 4-00లు యం.ఓ. పంపవలయును.

మేనేజర్,
శ్రీ యోగాశ్రమ్,
పెదవాల్తేరు P.O.,
విశాఖపట్టణము-17.

అని మేష్టారు చెప్పారు. అంటే తమ గూడెంచుట్టూ మురికి కాలవ లున్నట్లుగా ఈ దేశం చుటూరా సముద్రాలుంటాయి కాబోలు. మేష్టారింకో విషయంకూడా చెప్పారు. మేప్‌మీద సముద్రాల నీళ్ళ జాగాలో నీలంరంగు వేయమన్నారు. తమ గుడిసె వెనకాల కాలవనీళ్ళు యెప్పుడూ నల్లగా, బురదగా వుంటాయికదా. మరి నీళ్ళకు నీలంరంగెందు కబ్బా.

అయినాసరే సముద్రం నీళ్ళు నీలంగా వుంటాయని మేష్టారు చెప్పారుగనుక జాగ్రత్తగా దేశపటంచుట్టూ నీలంరంగు వేయసాగాడు చిన్నారావు.

ఈలోగా ఎదురుగావున్న ఆ గూడెపు ఒకే ఒక కుళాయిదగ్గర నారీ నారీ నడుమ పోరాటం మొదలయింది. పక్కగుడిసె నాంచారమ్మకూ, టీకొట్టు సాయిబు భార్య హసీనాబీకీ వచ్చింది తగాదా. నీ బిందె ముందా, నా కుండ ముందా అని బయలుదేరిన సదసత్ సంశయం అగ్రరాజ్యాల అభిప్రాయభేదాల స్థాయికి ఎదిగింది. అక్కడ అణ్వస్త్రాలయితే ఇక్కడ నఖలూ శిఖలూ వున్నాయి. అక్కడ ప్రకటనల వర్షాలయితే ఇక్కడ బూతుల వరదలు. అక్కడ రాకెట్లు ఎగిరితే ఇక్కడ జాకెట్లు చిరుగుతాయి. నాంచారమ్మ బానను హసీనాబీ జరిపితే, ఆవిడ సత్తుప్పేలాను నాంచారమ్మ విసిరికొట్టింది. ఆ నీళ్ళు కాస్తా చెదరికొచ్చి చిన్నారావ్ ఒడిలోని మేప్ మీద పడ్డాయి. అతడికి చాలా చిరాకేసింది. కాని అప్పటికే మూడవ ప్రపంచ యుద్ధానికి పూర్వ రంగంలావున్న ఆ జలతరంగాల మంటల్లో చిన్నారావ్ చిన్న ఒడిలోని దేశం ఎవరిక్కావాలి ?

చిన్నారావ్ నెమ్మదిగా తన చొక్కా మూలతో తడిని ఒత్తాడు. ఆ పటం కార్చిన కన్నీటిని నోటితో ఉఫ్‌మని వూదాడు. బంగాళాఖాతాన్ని ముగించి హిందూమహాసముద్రానికి నీలంరంగు పూయసాగాడు.

"అమ్మనాయనోయ్ .... చంపేశాడ్రోయ్ దేవుడో...." అన్న గావుకేకకు వులిక్కిపడ్డాడు చిన్నారావు.

పొట్టమీదనుంచి నెత్తురు కారుతుండగా పేరయ్య తూలుతూ పరుగెత్తుతున్నాడు. గూడెం గూడెం అంతా అల్లకల్లోలం అయింది. ఉన్న రెండువందలమంది ఓటర్లూ, కన్నాల్లోంచి ఎలుకలు వచ్చినట్లుగా బిలబిలమంటూ పోగయ్యారు. పేరయ్య ఆరునెలలనుంచి బాకీవున్న రెండ్రూపాయలూ ఇచ్చేయమని వెంకట్రావు అడిగాడట. పేరయ్య వెంకట్రావ్ తల్లితో మొదలుపెట్టి వాడి వంశవృక్షమంతా పెకలించాడట. రెండ్రూపాయలివ్వను పో అన్నాడట. వెంకట్రావ్ కత్తితో జవాబుచెప్పేసి పోయాడట—




చిన్నారావ్ పుస్తకాన్ని అక్కడపెట్టేసి గుంపుతోబాటు పరుగెత్తాడు.

రిక్షా మీద పేరయ్య నాస్పత్రికి తీసుకెళ్ళారు. లబో దిబో మంటూ వాడి పెళ్ళామూ వెళ్ళింది. అరగంటయ్యాక పోలీసులొచ్చారు. ఏవేవో అడిగారు. నలుగురినీ వేన్‌లోకి ఎక్కించుకుని వెళ్ళారు. కాని వారిలో వెంకట్రావు లేడు.

నీటి కుళాయిలో నీరు ఆగింది. నాయకులాళ్ళు ఆ పూటకు నిర్యుద్ధసంధి ప్రకటించారు. అలీన, మరియు లీన రాజ్యాలకు మల్లే గూడెం జనమంతా కత్తిపోటు ఉదంతాన్ని చర్చించసాగారు. ఆ పూటకు పైడయ్య తన బ్రాకెట్ కొట్టు కూడా కట్టేశాడు.

సాయంకాలం ఆరయింది. చీకటింకా రాలేదుగాని దుర్జనుడిని దూరంగా చూడగానే పక్కకు తప్పుకునే సజ్జనుడికిమల్లే వెలుతురు వెనక్కు నడవడం ప్రారంభించింది.

చిన్నారావ్ దేశపటానికి రంగులు పూయడానికి వెలుతురు చాలలేదు. వీధి దీపాలెప్పుడు వెలుగుతాయా అని వాడు కాచుకున్నాడు.

వాళ్ళ గుడిసె వెనకాల మన రాజకీయాలు ద్రవించి పారుతున్నట్లుగా, మహోధృతంగా పారుతోంది కుళ్ళు కాలవ. రాజకీయాల్లో ఆ రసజ్ఞులు తేలుతున్నట్లే ఈ కాలువలో రకరకాల చేపలు తేలుతూ, మున్గుతున్నాయి. ఈ నీళ్ళల్లో చేపలు జలకాలాడినట్లే అరకిలోమీటరవతల కల్లులో, సారాయిలో తేలియాడుతున్నారు సింగన్నలు, అప్పన్నలు, కొండయ్యలు, నూకరాజులు....

పట్టపగలే బ్రతుకుల్లో వెలుగులేని ఆ కలుగుల గూడెంలో చీకటి అలము



యౌవనం ఒక మహా ప్రవాహం లాంటిది. దానికి సరియైన ఆనకట్ట కట్టి ఆ నీటిని మళ్ళించినపుడే జీవితం ధన్యమౌతుంది.

—శ్రీ రామకృష్ణ పరమహంస

* * *

చిక్కని చీకటిలో దీపం కనబడినట్టు. దుఃఖాలు అనుభవించాక వచ్చిన సుఖం రాణిస్తుంది.

—శూద్రక మహాకవి

* * *

విద్యావంతుడు "విద్యావంతుణ్ణి" అని చెప్పుకొనటంలోనే విజ్ఞానాన్ని కోల్పోతాడు.

—గోర్కీ

* * *

మన కయిష్టమైన వ్యక్తుల్ని గురించి యోచించేందుకు నిమిషం కూడా వృధా చేయవద్దు.

—అరేనియన్

* * *

నీ మట్టుకు నీవు సాధ్యమైనంతవరకూ ప్రతి ఒక్కరితోనూ సామరస్యంతో జీవించు.

—ఆల్బర్ట్ ష్విడ్జర్

* * *

నీకు నచ్చే విధంగా తినాలి. కాని ఇతరులకు నచ్చేవిధంగా దుస్తులు ధరించాలి.

—ఫ్రాంక్లిన్

* * *

మంచి స్వభావం, సౌందర్యం తాలూకు లోటును ఎప్పుడూ భర్తీ చేస్తుంది. కాని, సౌందర్యం మంచి స్వభావమనే లోటును భర్తీ చేయలేదు.

—ఎడిసన్

* * *

తప్పు చేశానని ఒప్పుకోవడానికి ఎవరూ సిగ్గుపడనవసరం లేదు. మనిషి నిన్నటి కంటె నేడు మరింత వివేకవంతుడౌతాడు.

—పోప్

సేకరణ :

ఎమ్. లక్ష్మీనారాయణ, బల్వంతపూర్

కుంది. ఎన్నికల వాగ్దానాలవలె ఎనిమిదింట ఒక దీపం వెలిగింది.

ఆ దీపం కిందకు చేరాడు చిన్నారావ్. అరేబియా సముద్రానికి నీలి అందాలు దిద్ద సాగాడు.

ఆ గుడిసెల వంకర టింకర సందుల్లోకి గంటలు గణగణలాడించుకుంటూ కొన్ని రిక్షాలు జోరుగా, హుషారుగా ఒంటెల్లా షికారుకు వచ్చాయి. దేశ దేశాల నుంచి ఓడలమీద వచ్చిన శరీరాల ఎడారులు ఆ గుడిసెలలోని బడుగు ఒయాసిస్సులను చేరాయి.

చిన్నారావ్ నాన్న— నాగన్న ఆ పూట యింటికి రాలేదు. దాంతో 'ఎదవ సచ్చినాడు ఎక్కడ తాగి పడున్నాడో' నని బయలుదేరింది లచ్చమ్మ.

"ఓ రబ్బీ, చిన్నిగా! గుడిసె జాగర్తరా నాయనా! కుక్కొచ్చి సల్దికుండ దొర్లించీగల్దు—" అని హెచ్చరించి మరీ బయలుదేరింది. కాని అరేబియా సముద్రం అంచున నీలి పెన్సిలు కాస్త గీతదాటి దేశంలోకి వెళ్ళిపోగా ఉత్పన్నమయిన సరిహద్దు సమస్యతో సతమతమవుతున్న చిన్నారావ్, యాంత్రికంగా "సరే" నన్నాడు వాళ్ళమ్మతో.

పావు గంటయ్యాక నాగన్నను లాక్కుంటూ మోసుకుంటూ వచ్చింది లచ్చమ్మ. ఆమె వాడిని శాపనార్థాలు పెడుతుంటే వాడామెను బండబూతులు తిడుతున్నాడు. గుడిసెలోకి రాగానే వాడు అన్నం కావాలన్నాడు. రొయ్యల వేపుడన్నాడు. దాంతో లచ్చమ్మకు తిక్క రేగింది. "ఏట్రా - ఎర్రి ఏసాలేతున్నావేంది? నువ్వొచ్చి రూపాయలిత్తావని నాను జూత్తుంటే నువ్వా కల్లుపాకాడ పీకమొయ్యా తాగి పడుంటివి.. తాగడానికి కూల్డబ్బులు తగలెడితే కుండలోకి అన్నమెట్లా ఒత్తుందిరా? నాకాడ డబ్బులుంటే ఆ ఎదవ పాకకాడికి నానెందు కొద్దును? పొద్దుననగా సల్ది తిన్న ఆ బిడ్డడికింత కూడు పెట్టాలన్న గ్యానం అయ్యగాడివయిన నీకు నేపోతే నానెట్టా సచ్చేది?" అని కుతకుత ఉడికిపోయింది లచ్చమ్మ.

చివరకు కథ మామూలు క్లైమాక్స్‌కే చేరింది. ఆమె జుత్తు వంచి చితకబాదాడు నాగన్న. లచ్చమ్మ కిందపడి భోరుమని ఏడవసాగింది.

చిన్నారావ్‌కూ ఏడుపు వచ్చింది. కోపమూ వచ్చింది. వెంటనే పెద్దవాడయిపోయి, రెండు చేతులలోనూ రెండు లాటీ కర్ర లుంచుకుని నాన్నను చావబాదాలనిపించింది. అరేబియా సముద్రం రంగు పని గబగబ పూర్తిచేసి, మేప్‌ని తెలుగు వాచకంలో దాచి పుస్తకాల సంచిని మూల పడేసి లేచి వెళ్ళిపోయాడు.

ఈ గొడవంతా విని యెదుటి గుడిసె సూరక్క వచ్చింది. ఆమె నాగన్నను, లచ్చమ్మను సరిసమానంగా చీవాట్లుపెట్టి చిన్నారావ్‌ని తన గుడిసెలోకి తీసుకు వెళ్ళింది. వాడికింత మజ్జిగన్నం పెట్టింది. రెండు బిస్కెట్లు యిచ్చింది.

"ఇవెంతో బాగున్నాయి. నీకెవరిచ్చారక్కా?" అని చిన్నారావడిగితే సూరక్క నవ్వింది.

"అవా? అవి జపాన్‌నుంచి ఎవరో తెచ్చిచ్చార్రా!" అంది ఆకలితో డేలు తన్ను తొలిచివేసిన తొలి దినాలను నెమరు వేసుకుంటూ.

హఠాత్తుగా ఏదో ఆవేశం వచ్చిన దానిలా సూరక్క వాడిని గట్టిగా హత్తుకుని "ఒరే తమ్ముడూ! నువ్వెప్పుడూ ఆకలితో బాధపడమాక.... నాన్నీకు కావల్సింది పెడతాను. తిని సక్కంగ సదువుకో.... ఇన్నావా? సక్కగా సదువుకో. సదువుకోని మాంచి రాజాలాటి ఉజ్జోగం సంపాదించు, సంపాదించి ఇక్కడినుంచి ఎల్లిపో.... నాలాగా, మీ అమ్మ, అయ్యలాగా, ఈ మురికి కాలవ నీళ్ళలాగ బతకమాక.... దర్జాగా గోదారి తల్లిలాగా జోరుగా బతుకు-" అని వాడిని ముద్దుపెట్టుకుంటుంటే ఆమె కళ్ళ వెంబడి నీటిబొట్లు రాలాయి.

చిన్నారావ్‌కు లోలోపల ఏదో చల్లగా తడిసి ముద్దయిపోయినట్లు, హాయిగా వున్నట్లు అనిపించింది. ఆ క్షణాన కృష్ణకుమార్‌కన్న తానే గొప్పవాడనిపించింది. తప్పకుండా చదివి, పెరిగి పెద్దయి ఉద్యోగంలో చేరి, డబ్బులు సంపాదించి, సూరక్కనూ, అమ్మనూ తీసుకెళ్ళి పెద్ద బంగళాలో వుంచాలి అనిపించింది. నాన్నను, వెంకట్రావ్‌ను, కల్లుపాక రత్తయ్యను వాళ్ళెవరినీ ఆ బంగళావైపు రానివ్వకూడ దనిపించింది.

ఆస్పత్రి కెళ్ళినవాళ్లు తిరిగి వచ్చారు. పేరయ్యకు కుట్లు వేశారుట. కుళాయి నిద్రపోతూంది. హసీనాబీ తల్లో పేలను నాంచారమ్మ కుక్కుతూంది.

చిన్నారావ్ మగత నిద్రలోకి జారిపోతుండగా లచ్చమ్మవచ్చి వాడిని పిలిచింది. సూరక్క చెబుతున్న కథ వింటున్న చిన్నారావ్ రానన్నాడు. "ఈ పూటకు యిక్కడే పడుకుంటాడు లేవమ్మా—" అంది సూరక్క.

లచ్చమ్మ సరేనని వెళ్ళిపోయింది.

ఇంకాసేపటికి చిన్నారావ్ నిద్రపోయాడు.

సెప్టెంబర్ విడుదల
ప్రసిద్ధ నవలా రచయిత్రి
ఆర్. సంధ్యాదేవి
మరో మరపురాని నవల
'సంసార స్వప్నం'
క్వాలిటీ పబ్లిషర్స్,
రామమందిరంవీధి, విజయవాడ-2.



వార్తలకు, వ్యాఖ్యలకు
"ఆంధ్ర జ్యోతి"
దినపత్రికనే చదవండి

డా॥ పి. వి. కె. రావ్, B. A.,
వైద్యవిద్వాన్, వేద్యాచార్య, సెక్స్ స్పెషలిస్ట్



వివాహము వాయిదా వేయవవసరంలేదు. హస్త ప్రయోగం, నరముల బలహీనత, శీఘ్ర స్ఖలనములకు ఆయుర్వేద చికిత్స పోస్టు ద్వారా చికిత్స కలదు.
రావూస్ క్లినిక్,
బి. బి. రోడ్, తెనాలి. ఫోన్ : 700. 1010

పదకొండు దయేసరికి గుడిసె బయట రిక్షా ఆగిన చప్పుడయింది. సూరక్క లేచి వెళ్ళి రిక్షావాడితో "ఇవాళ ఎవరూ రాన ద్దయ్యా.... లోపల అబ్బాయి నిద్రపోతు న్నాడు." అని చెప్పి పంపించేసింది. లోపలికి వచ్చి చిన్నారావ్ పక్కన పడుకుంది. శరీరమూ, మనసూ పుండయి పీటలుపారిన ఆమెకు ఆ పూట చల్లగా వుంది.

కాస్సేపటికి ఆమెకూ కూడా నిద్రపట్టింది.

గూడెం అంతా నిశ్శబ్దంగా వుంది. కుక్కలూ, ఒకరిద్దరు మనుషులు తప్ప వేరేమీ సంచారం లేదు. అన్ని బాధలకూ మందువంటిదయిన నిద్ర గూడెం అంతటా ఆవరించింది.

ఆ చల్లని నిశ్శబ్దాన్ని చీలుస్తూ ఎవరో కేక వేశారు. చాలమంది ఉలిక్కిపడి లేచారు.

"నిప్పు, నిప్పు!.. బాబోయ్ మంటలు! ఆర్పండి.. లాగండి.. పిల్లలు జాగ్రత్త.. ఒరే అప్పన్నా.. సామాన్లు తీయండి.... ఓరయ్యో.... నాయనో.... తల్లీ....ఎక్కడున్నావమ్మా...."

కేకలు, కూకలు, ఆర్తనాదాలు, హాహాకారాలు.... ఎవరో పారేసిన సిగరెట్టు పీకతో తాటాకు రాజుకుంది.

తాటాకుతో గుడిసె అంటుకుంది.

గుడిసె నుండి గూడెమంతా మంట లలముకున్నాయి.

ఆ గూడెంలోని బాధంతా చిచ్చుగా పెరిగి, ఎర్రగా వెలిగి వేయి నాల్కలతో ఆకాశంలోని చంద్రుడిని అందుకో జూచింది.

ఇసుక వచ్చింది. నీళ్ళ బకెట్లు వచ్చాయి. ఫైరింజన్లు వచ్చాయి.

మంటలారాయి. నిప్పు చల్లారింది. పొగ అణిగింది. కాలిన గుడిసెల నల్లటి నుసి నీటిలో కలిసి యమునగా పారింది.

హడావిడి అంతా ముగిసేసరికి తెల్లవారుఝామయింది.

సూరక్కతో బాటు ఉలిక్కిపడి లేచిన చిన్నారావ్ ఈ కోలాహలం అంతటినీ భయంగా, వింతగా చూశాడు. సగం నిద్రలో లేచిన వాడికి పూర్తిగా మెలకువ రాలేదు.

అంతా ముగిసేసరికి చిన్నారావ్‌కి హఠాత్తుగా గుర్తొచ్చింది.

పరుగెత్తుకుని వెళ్ళాడు తమ గుడిసెకు. అక్కడ గుడిసె లేదు. గుడిసెలో పదప భాగమంత బూడిద వుంది. వాడి గుండె కలుక్కుమంది. కళ్ళల్లో నీళ్ళు కమ్మాయి

"ఏంట్రా యెదవా? ఏటి కావాలి? అందరి వస్తువులూ అవుగో ఆడున్నాయి.



చూడుపో! మీ అమ్మ, నాన్న నీ కోసం వెతుకుతున్నార్రా-" అని మందలించారెవరో.

పరుగెత్తుకు వెళ్ళాడు చిన్నారావ్.

అక్కడ సులకమంచాలు, బట్టల మూటలు, గోనెసంచులు, గిన్నెలు, బాల్చీలు, వాసాలు, విరిగిన కుర్చీలు గుట్టలు గుట్టలుగా పడివున్నాయి. ఎవరి వస్తువుల కోసం వారు వెతుకుతున్నారు.

ఆబగా

కసిగా

కోపంగా

దుఃఖంగా

గాలించాడా గుట్టను చిన్నారి చిన్నారావ్.

అశోక వనమంతా జానకమ్మకోసం గాలించిన ఆంజనేయుడిలా అన్వేషించాడు చిన్నారావ్.

ఉంది.

హమ్మయ్య!

వాడి పుస్తకాల సంచి వుంది.

సంచిలో తెలుగువాచకం వుంది.

తెలుగు వాచకపు పుటల మధ్య, కాస్త నలిగినట్లున్నా, భద్రంగా వుంది వాడి భారతదేశ పటం. రెండు రంగు పెన్సిళ్ళు వున్నాయి.

ఎవరెస్టెక్కిన టెన్సింగ్‌లా ఎగిరెగిరి పడింది వాడి ఎద.

"అమ్మయ్య - ఇవాళ మేష్టారికి తీసు కెళ్ళి చూపించవచ్చులే" అని వాడి మనసు సంతృప్తిపడింది.

వాడక్కడే—ఆ కాలిన కంపుల గుడిసెల మంటల బూడిదల పొగల దుమ్ముల నేలమీదే కూచుని—భారతదేశాన్ని అతి భద్రంగా తన ఒడిలో వుంచుకుని, లోపలి వైపు రంగు పెన్సిలుతో ఆకుపచ్చ రంగును వేయసాగాడు.

తూరుపు ఆకాశ పటంమీద బాల సూర్యుడు బంగారు పెన్సిళ్ళతో రంగులు పూయసాగాడు!